సాక్షి కర్నూలు

బుధవారం: 13, డిసెంబర్, 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయప్రాంగణంలోని శనగల బసవన్న, బయలువీరభద్ర స్వామికి మంగళవారం అర్చకులు విశేష పూజలు నిర్వహించి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించారు.



సుంకేసులకు నిలిచిన ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు ఎగువ నుంచి ఇన్ ఫ్లో నిలిచి పోయింది. డ్యాంలో నుంచి మంగళవారం కాల్వకు 221 క్యూ సెక్కుల నీరు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.



ఉత్సవాలకు రూ. 10.53 కోట్లు

శ్రీశైలంటెంపుల్: మల్లన్న సన్నిధిలో శివరాత్రి ఉగాది ఉత్సవాల నిర్వహణ పనులు రూ. 10.53 కోట్లతో చేపట్టాలని మంగళవారం ధర్మకర్తల మండలి నిర్ణయించింది.

8లో▸

న్యూస్‌రీల్

కృష్ణమ్మకు నదీ హారతి



హారతి ఇస్తున్న ఆలయ పురోహితుడు

కొత్తపల్లి: సప్తనది సంగమ ప్రాంతంలో వెలసిన ప్రాచీన సంగమేశ్వరంలో మంగళవారం కార్తీకమాస పూజలు నిర్వహించారు. కార్తీక మాస అమావాస్య సందర్భంగా కృష్ణాతీరంలో నదీజలాలకు ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ భక్తులతో కలసి హారతి ఇచ్చారు. అంతకు మునుపు వేపధారు శివలింగానికి విశేష పూజలు చేశారు.

చేనేతకారులకు 15 శాతం సబ్సిడీపై నూలు

కర్నూలు(అగ్రికల్చర్): చేనేత సహకార సంఘాల్లో లేని చేనేతకారులకు 15 శాతం సబ్సిడీపై నూలు సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సంఘాలలో ఉన్న చేనేతకారులకు ఇప్పటికే 15 శాతం సబ్సిడీపై ఎన్‌హెచ్‌డీసీ ద్వారా నూలు సరఫరా అవుతోంది. గ్రూపు మొత్తంగా పాసు పుస్తకం ఉంటుంది. సంఘాలతో సంబంధం లేకుండా చేనేత వృత్తిలో రాణిస్తువారికి కూడా సబ్సిడీపై నూలు సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు వ్యక్తిగతంగా పాసు పుస్తకాల జారీకి ప్రతిపాదనలు పంపుతున్నట్లుగా ఉమ్మడి జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు హరికృష్ణ మంగళవారం విలేకర్లకు తెలిపారు. కర్నూలు జిల్లాలో 553 మందికి, నంద్యాల జిల్లాలో 100 మంది చేనేతకారులకు వ్యక్తిగతంగా పాసుపుస్తకాలు జారీ చేయడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతిపాదనలపై జాయింట్ వెరిఫికేషన్ అనంతరం పాసుపుస్తకాలు జారీ అవుతాయన్నారు.

ఆకట్టుకున్న కళా ఉత్సవ్ పోటీలు

కర్నూలు సిటీ: జిల్లా విద్యా శిక్షణ సంస్థ (బి.తాండ్రపాడు, డైట్ కాలేజీ)లో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్-2023 పోటీలు ఆకట్టుకున్నాయి. కాలేజీ ప్రిన్సిపాల్ పి.వసుంధరా దేవి ప్రారంభించిన ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి 9,10,11,12 తరగతులకు చెందిన 42 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం 10 విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. ఇందులో ఓకల్ మ్యూజిక్ (గాత్ర సంగీతం) విభాగంలో ఐ.కపిల్ ధరహాస్ (బాలురు), సి. మోక్షిత (బాలికల విభాగం), ఓకల్ మ్యూజిక్-సంప్రదాయంలో కేశవ తేజొనిధి (బాలురు), కె.హాసిని (బాలికలు), ఇన్‌స్టుమెంటల్ మ్యూజిక్-పెర్క్యూసివ్ (తబల, మృదంగం, డ్రమ్స్)లో బి.కె. సాయి చరణ్, ఇన్‌స్టుమెంటల్ మ్యూజిక్ మెలోడిక్ (వీణ, వయోలిన్, సితార్)లో బి.కె. యశ్వంత్(బాలురు), బి.లాస్యశ్రీ (బాలికలు), డ్యాన్స్-క్లాసికల్‌లో సత్య స్నేహిత, ఫోక్ (జానపద)లో మహిత, విజువల్ ఆర్ట్స్-2డీ (ద్వితీయం)లో జి.ధన్వి సాయిశ్రీ, డ్రామా-సోలో యాక్టింగ్ విభాగంలో యం.వి. సాత్విక గెలుపొందారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించిన విజేతలకు ప్రిన్సిపాల్ తదితరులు సర్టిఫికెట్లను అందజేసి, అభినందనలు తెలిపారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కిరణ్, ఎం.మల్లికార్జున నాయక్, రమణయ్య, నాగ సాయి ప్రదీప్, సుధీర్ రాజు, పి.జనార్ధన్ రెడ్డి, వై.వెంకట సుబ్బమ్మ వ్యవహరించారు.

శబరిమల దర్శన వేళలు పొడిగింపు

కర్నూలు కల్చరల్: శబరిమల అయ్యప్ప స్వామి దర్శన వేళలను పొడిగించారు. భక్తుల తాకిడి పెరగడంతో ఈ ట్రావెన్ కోర్ దేవస్థానం బోర్డు నిర్ణయం తీసుకుంది. సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు ఉన్న దర్శన వేళలను గంట పెంచారు. దీంతో మధ్యాహ్నం 3 గంటల నుంచే భక్తులకు అయ్యప్ప దర్శనం మొదలవుతుంది.

అయ్యప్ప భక్తులకు 'అయ్యన్' యాప్

శబరిమల అయ్యప్ప దర్శనానికి వెళ్లే భక్తుల కోసం కేరళ అటవీ శాఖ అధికారులు 'అయ్యన్' యాప్‌ను తీసుకొచ్చారు. స్వామి దర్శనం కోసం పెద్దపాదం (సుమారు 67 కిలోమీటర్లు) నడిచే భక్తులను దృష్టిలో ఉంచుకుని ఈ యాప్‌ను రూపొందించారు. వన్యప్రాణుల నుంచి రక్షణతో పాటు భక్తులు తమకు ఏదైనా సాయం కావాల్సి వస్తే ఆ యాప్ ద్వారా అధికారులను సంప్రదించవచ్చు. అయ్యన్ యాప్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంది.

ఆశలన్నీ కేంద్ర బృందంపైనే!

- 2023-24లో ఉమ్మడి జిల్లాలో కరువు పరిస్థితులు
- కర్నూలు జిల్లాలో 24, నంద్యాల జిల్లాలో 6 మండలాలు కరువు ప్రాంతాలుగా గుర్తింపు
- జూన్ నుంచి డిసెంబరు వరకు కేవలం రెండు నెలల్లోనే అధిక వర్షాలు
- సాధారణ వర్షపాతం 548.3 మి.మీ.. కురిసింది 352 మి.మీ మాత్రమే
- ఖరీఫ్‌తో పాటు రబీ పంటలపై కూడా తీవ్ర ప్రభావం
- నేడు జిల్లాలో సెంట్రల్ టీమ్ పర్యటన



కోడుమూరు సమీపంలో వర్షాభావంతో దెబ్బతిన్న పత్తి పంట

కర్నూలు(అగ్రికల్చర్): రైతుల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రకృతి సహకరించక పోవడంతో 2023-24లో ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులు నష్టాలు మూట కట్టుకున్నారు. వాతావరణ మార్పుల కారణంగా ఏడాదంతా వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో మొదటి సారిగా అనావృష్టి పరిస్థితులు ఏర్పడి రైతులు నష్టపోయారు. కర్నూలు జిల్లాలో 24 మండలాలు, నంద్యాల జిల్లాలో 6 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించింది. పంట నష్టంపై ఎన్యూమరేషన్ కూడా చేపట్టి ఉమ్మడి జిల్లాకు ఇన్‌పుట్ సబ్సిడీ కోసం రూ.456.63 కోట్లతో నివేదిక కూడా ప్రభుత్వానికి పంపారు. కర్నూలు జిల్లాలో తుగ్గలి, కర్నూలు రూరల్, నంద్యాల జిల్లాలో ప్యాపిలి, డోన్ మండలాల్లోను కరువు తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ కొన్ని గణాంకాల వల్ల వాటిని కరువు మండలాల జాబితాలోకి చేర్చలేదు. ఈ మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించేందుకు ఆయా జిల్లా కలెక్టర్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. బుధ, గురువారాల్లో ఉమ్మడి జిల్లాలో పర్యటించే సెంట్రల్ టీమ్‌పై రైతాంగం ఆశలు పెట్టుకుంది. టీమ్ దృష్టికి జిల్లా కరువు పరిస్థితిని కళ్లకు కట్టినట్లు చూపించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లా కలెక్టర్ సృజన, జేసీ నారాపురెడ్డి మౌర్య ఆధ్వర్యంలో సెంట్రల్ టీమ్‌కు ఇచ్చే నివేదికను సిద్ధం చేసింది. ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా కరువు తీవ్రతను కూడా వివరించనున్నారు. ఆయా నియోజక వర్గాల శాసనసభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా కరువు ప్రభావంతో ప్రజలు పడుతున్న కష్ట, నష్టాలను వారి దృష్టికి తీసుకెళ్లనున్నారు. కేంద్ర బృందం నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో రాష్ట్ర ప్రభుత్వం రైతులను మరింత ఆదుకోనుంది.

రెండు నెలల్లోనే అధిక వర్షాలు

ఖరీఫ్ సీజన్ జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఉంటుంది. అక్టోబరు నుంచి మార్చి వరకు రబీ, లేట్ రబీ సీజన్లు ఉంటాయి. జూన్ నుంచి డిసెంబరు నెల వరకు పరిశీలిస్తే జూలై, అక్టోబరు నెలల్లో మాత్రమే అధిక వర్షాలు కురిశాయి. మిగిలిన అన్ని నెలల్లో వర్షాలు అంతంత మాత్రానికే పరిమితం కావడం గమనార్హం. వర్షాలు తక్కువ కావడంతో భూగర్భ జలాలు కూడా పడిపోతున్నాయి. 2022 నవంబరులో భూగర్భ జలాలు 4.84 మీటర్లలో ఉండగా 2023 నవంబర్‌లో 7.80 మీటర్ల లోతుకు పడిపోయాయి. దీన్ని బట్టి చూస్తే రానున్న రోజుల్లో నీటి సమస్య మరింత ఎక్కువగా ఉండే ప్రమాదం కనిపిస్తోంది.

3.88 లక్షల హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు

2023-24 ఖరీఫ్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలు 3,88,911 హెక్టార్లలో 33 శాతం పైగా దెబ్బతిన్నట్లు ఆయా శాఖల అధికారులు ప్రాథమిక నివేదిక రూపొందించారు. వ్యవసాయ శాఖకు సంబంధించి 3,32,714 హెక్టార్లు, ఉద్యానశాఖకు సంబంధించి 56,810 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. గతంలో ఎంత కరువు ఉన్నా రైతులకు 50 శాతం పంట దక్కేది. ఈ ఏడాది మాత్రం 20 శాతం కూడా పంట దక్కకపోవడం రైతులను ఆందోళన కలిగిస్తోంది. ఉద్యాన శాఖలో టమాట, ఉల్లి, పచ్చిమిరప, ఎండు మిరపపై వర్షాభావం ఎక్కువగా ఉంది. వ్యవసాయ శాఖకు సంబంధించి దాదాపు అన్ని పంటలపై కూడా ఈ ప్రభావం ఉన్నట్లు స్పష్టమవుతోంది. కరువు ప్రాంతంగా గుర్తించని తుగ్గలిలో 57,694 ఎకరాల్లో, కర్నూలు రూరల్ మండలంలో 25 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.

రబీ కూడా చేతికందనట్లే..

వర్షాభావం ప్రభావంతో జిల్లాలో రబీ పంటలపై కూడా రైతులు ఆశలు వదులుకున్నారు. సెప్టెంబరులో విస్తారంగా వర్షాలు కురిస్తేనే రబీ సాగుతుంది. ఈ సారి సెప్టెంబరులో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉండటంతో రబీ సాగు ముందుకు కదల్లేదు. రబీ సాధారణ సాగు 1.21 లక్షల హెక్టార్లు కాగా 63,009 హెక్టార్లలో మాత్రమే విత్తనం వేశారు. అయితే భూమిలో తేమ లేకపోవడంతో రబీ పంటలు చాలా వరకు దెబ్బతిన్నాయి. అటు ఖరీఫ్, ఇటు రబీ సీజన్లపై వర్షాభావం ప్రభావం తీవ్రంగా ఉండటంతో అన్నదాతల్లో అంతులేని ఆందోళన గూడు కట్టుకుంది.

రేపు నంద్యాల జిల్లాలో..

నంద్యాల జిల్లాలో బేతంచెర్ల, బనగానపల్లె, గడివేముల, మిడుతూరు, పగ్యిడాల, పాణ్యం మండలాలను కరువు ప్రాంతాల జాబితాలో చేర్చారు. జిల్లాలో సెంట్రల్ టీమ్ ఈ నెల 14న బేతంచెర్ల, మిడుతూరు, పగిద్యాల మండలాల్లో పర్యటించి కరువు తీవ్రతను పరిశీలించడంతో పాటు రైతులతో ముఖాముఖి కానుంది. ఇప్పటి వరకు కరువు ప్రాంతాలుగా గుర్తించిన ఆరు మండలాల్లో 22,812 హెక్టార్లలో పంటలు దెబ్బతినగా.. ఇన్‌పుట్ సబ్సిడీ కోసం రూ.26.87 కోట్లతో నివేదిక పంపారు. ఈ క్రమంలో డోన్, ప్యాపిలి మండలాల్లోని కరువు తీవ్రతను సెంట్రల్ టీమ్ దృష్టికి తీసుకపోవడానికి ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. ప్యాపిలి మండలంలో 46 వేల ఎకరాలు, డోన్ మండలంలో 35 వేల ఎకరాల్లో పంటలు 33 శాతంపైగా దెబ్బతిన్నాయి. ప్రధానంగా వేరుశనగ, ఆముదం, కంది పంటలు వర్షాభావం వల్ల దెబ్బతిన్నాయి.



ప్యాపిలి సమీపంలో ఎండిన వేరుశనగ పంట

కర్నూలు జిల్లాలో వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.

నెల	సాధారణ వర్షపాతం	నమోదైన వర్షపాతం
జూన్	77.7	51.7
జూలై	90.7	137.4
ఆగస్టు	116.2	26.6
సెప్టెంబరు	116.5	90.2
ఖరీఫ్ మొత్తం	401.1	305.9
అక్టోబరు	110.2	1.1
నవంబరు	29	49
డిసెంబరు	8	1.8
రబీ మొత్తం	147.2	46.1
మొత్తం	548.5	352.0

కరువు తీవ్రతను సెంట్రల్ టీమ్ దృష్టికి తీసుకెళ్తాం



జిల్లాలో నెలకొన్న కరువు తీవ్రతను సెంట్రల్ టీమ్ దృష్టికి తీసుకెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. బుధవారం ఉదయం అనంతపురం నుంచి సెంట్రల్ టీమ్ ప్రతినిధులు పత్తికొండ మండలానికి చేరుకుంటారు. పత్తికొండ, ఆస్పరి, ఆదోని, ఆలూరు, దేవనకొండ, కోడుమూరు మండలాల్లోని కరువు పరిస్థితులను కేంద్ర బృందం సభ్యులు పరిశీలిస్తారు. రైతులతో ముఖాముఖి అవుతారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసే ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తారు. తుగ్గలి, కర్నూలు రూరల్ మండలాలను కూడా కరువు మండలాలుగా గుర్తించేందుకు నివేదికలు పంపాం. ఈ రెండు మండలాల కరువు పరిస్థితులను కూడా సెంట్రల్ టీమ్ దృష్టికి తీసుకెళ్తాం. గురువారం కూడా జిల్లాలోని ఒకటి, రెండు మండలాల్లో సెంట్రల్ టీమ్ పర్యటించే అవకాశం ఉంది.

– డాక్టర్ జి.సృజన, కర్నూలు జిల్లా కలెక్టర్

తుగ్గలి మండలాన్ని కరువు ప్రాంతంగా గుర్తించాలి



పత్తికొండ నియోజకవర్గంలోని తుగ్గలి మండలంలో కూడా తీవ్రమైన కరువు పరిస్థితులు ఉన్నాయి. ఈ మండలాన్ని కొన్ని గణాంకాల కారణంగా కరువు ప్రాంతంగా గుర్తించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మాకు 9 ఎకరాల భూమి ఉండగా 5 ఎకరాల్లో వేరుశనగ, 4 ఎకరాల్లో కంది సాగు చేశాం. వేరుశనగ వర్షాభావంతో పూర్తిగా దెబ్బతినింది. ఎకరాకు 50 కిలోల దిగుబడి కూడా రాలేదు. కందిలో ఎకరాకు క్వింటా మాత్రమే దిగుబడి వచ్చే అవకాశం ఉంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సారి నష్టపోయాం. తుగ్గలి మండలం జరిగిన పంట నష్టాన్ని కూడా సెంట్రల్ టీమ్ దృష్టికి తీసుకుపోతాం. ఈ మండలాన్ని కూడా కరువు ప్రాంతంగా గుర్తించి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది.

– నారాయణనాయక్, జొప్లాతండా, తుగ్గలి మండలం

ముస్లింల సంక్షేమమే ధ్యేయం



పాదయాత్ర చేస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, చిత్రంలో జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి

- ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి
- ప్యాపిలిలో అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి

ప్యాపిలి: ముస్లింల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ప్యాపిలి పట్టణంలో రూ. 16 కోట్లతో నిర్మించిన నాలుగు లైన్ల రహదారి, రూ. 67 లక్షలతో ఆధునీకీకరించిన ఆర్టీసీ బస్టాండ్, రూ. 30 లక్షలతో ఆధునికీకరించిన షాదీఖానా భవనాలను జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలసి ప్రారంభించారు. ముందుగా ప్యాపిలి బైపాస్ రోడ్డు వద్ద ఆర్థికమంత్రికి స్థానిక మహిళలు అధిక సంఖ్యలో హాజరై ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మహిళలతో కలిసి దాదాపు 6 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. మార్గమధ్యలో ఆధునికీకరించిన షాదీఖానా, ఆర్టీసీ బస్టాండ్‌ను మంత్రి ప్రారంభించారు. షాదీఖానా కమిటీ సభ్యులు మస్తాన్ ఖాన్ తదితరులు మంత్రిని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ముస్లిల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముస్లిం మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో శిథిలావస్థలో ఉన్న షాదీఖానాకు ఆధునిక సౌకర్యాలు కల్పించామన్నారు. జలదుర్గం గ్రామంలో కోటి రూపాయల వ్యయంతో షాదీఖానా పనులు చేపడుతున్నామని తెలిపారు. జగనన్న పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంక్షేమ పథకాలతో లబ్ధి పొందుతూ సంతోషంగా జీవిస్తున్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ నేతలు ప్రజలను పక్కదోవ పట్టించే హామీలు ఇస్తున్నారని మంత్రి విమర్శించారు. టీడీపీ ప్రలోభాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం మంత్రి వెంగళాంపల్లి వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను, కొత్తకోట వద్ద నిర్మిస్తున్న డ్రైవింగ్ స్కూల్ పనులను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొర్రా మల్లికార్జునరెడ్డి, ఏపీ ఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు బోరెడ్డి రాము, ఆలేబాదు బాలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు దిలీప్ చక్రవర్తి, కమతం భాస్కర్ రెడ్డి, రామచంద్రరెడ్డి, రాజామురళి, శ్రీనివాసరెడ్డి, బషీర్, సోమశేఖర్, కొండయ్య, మస్తాన్ ఖాన్, షాషా, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహుళ ప్రయోజనాల భవన నిర్మాణాల్లో వేగం పెంచండి

- 'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేయాలి
- ఇప్పటికే మెటీరియల్ కిట్లు పంపిణీ
- జిల్లా కలెక్టర్ డా.జి సృజన



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డా.జి సృజన

కర్నూలు(అర్బన్): జిల్లాలో బహుళ ప్రయోజనాల భవన నిర్మాణాల్లో వేగం పెంచి నిర్ణీత సమయంలోగా వాటిని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జేసీ నారపురెడ్డి మౌర్యతో కలిసి ఆమె జిల్లా స్థాయి కో-ఆపరేటివ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 102 బహుళ ప్రయోజనాల భవనాలు మంజూరు కాగా, ఇప్పటి వరకు 35 మాత్రమే పూర్తి చేశారని అసహనం వ్యక్తం చేశారు. ఈ నెల 18వ తేది నాటికి మరో 35 భవన నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. 25వ తేది నాటికి బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న మిగిలిన గోదాములను పూర్తి చేసి రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ డీఈని ఆదేశించారు. సీసీఆర్‌సీ కార్డుల ద్వారా కౌలు రైతులకు రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని డీసీఓ ఎస్ రామాంజనేయులును జేసీ ఆదేశించారు. ఇప్పటి వరకు పసుపుల సొసైటీ నుంచి 34 మంది కౌలు రైతులకు రూ.15 లక్షలు, ఉల్చాల సొసైటీ నుంచి 30 మందికి రూ.12 లక్షల మేర రుణాలు మంజూరు చేశామని డీసీఓ జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో కేడీసీసీ బ్యాంకు సీఈఓ పి. రామాంజనేయులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, మార్కెటింగ్ ఏడీ నారాయణమూర్తి, జిల్లా హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు, మార్కెటింగ్ ఇంజినీర్లు, పలు సొసైటీల సభ్యులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'పై దృష్టి సారించాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.జి. సృజన మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలను ఆదేశించారు. మంగళవారం ఆమె అసైన్డ్‌మెంట్ భూములు, ఎన్నికలు, హౌసింగ్, ఆడుదాం ఆంధ్ర అంశాలపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సచివాలయ పరిధిలో కబడ్డీ, ఖో-ఖో, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ ఆటలు కచ్చితంగా నిర్వహించాలని, ఈ క్రీడలకు సంబంధించిన ప్లేయర్స్ రిజిస్టర్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజక వర్గాలు, మండలాలు, సచివాలయాలకు మెటీరియల్ కిట్లను పంపిణీ చేశామన్నారు. కిట్లు అందినట్లుగా ఆన్‌లైన్‌లో అకనాలెడ్జ్‌మెంట్‌లను అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓను ఆదేశించారు. గ్రౌండ్ మ్యాపింగ్‌కు సంబంధించి ఇంకా చేయని సచివాలయాలు ప్రైవేటు లేదా ప్రభుత్వ మైదానాలను గుర్తించి మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. అసైన్డ్‌మెంట్ భూములకు సంబంధించి చెక్‌లిస్ట్ ప్రకారం పరిశీలించి జాయింట్ కలెక్టర్ లాగిన్‌కు పంపించాలని తహసీల్దార్లను ఆదేశించారు. హౌసింగ్‌లో ఎస్‌హెచ్‌జీ రుణాలకు వడ్డీ సబ్సిడీకి సంబంధించి ఇంజినీరింగ్ అసిస్టెంట్లు 25 శాతమే అప్‌డేట్ చేశారని, పూర్తి స్థాయిలో చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, కర్నూలు మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, హౌసింగ్ పీడీ ఎం. సిద్ధలింగమూర్తి, జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి పాల్గొన్నారు.

నగరపాలకకు గడప గడప నిధులు

- 89 అభివృద్ధి పనులకు రూ.5.22 కోట్లు మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

కర్నూలు (టౌన్): నగర పాలక సంస్థలో మరిన్ని అభివృద్ధి పనులు జరుగనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మరోసారి గడప గడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) కార్యక్రమం కింద నిధులు మంజూరు చేసింది. దీంతో నగరంలోని కర్నూలు, పాణ్యం, కోడుమూరు అర్బన్ నియోజకవర్గ పరిధిలో గుర్తించిన 89 అభివృద్ధి పనులను రూ.5. 22 కోట్లతో చేపట్టేందుకు పరిపాలన అనుమతులు జారీ చేస్తూ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలోని 136 సచివాలయాల పరిధిలో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ గడప గడపకు మన ప్రభుత్వం పేరుతో పర్యటిస్తున్నారు. వారి పరిధిలోని కాలనీల్లో ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకుంటున్నారు. వెనువెంటనే వాటిని ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు చేపట్టేందుకు అవసరమైన నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపుతున్నారు. తాజాగా మంజూరైన నిధులతో నగరంలోని అన్ని కాలనీల్లో ప్రాధాన్యత క్రమంలో సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణం, పైపులైన్ పనులు చేపట్టనున్నట్లు నగరపాలక ఇంజినీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షాకీర్ హుస్సేన్ మంగళవారం తెలిపారు.

వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జిగా గాజుల శ్వేతారెడ్డి



కర్నూలు(రాజ్‌విహార్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్(కర్నూలు, అన్నమయ్య జిల్లాలు) ఇన్‌చార్జిగా గాజుల శ్వేతారెడ్డిని నియమించారు. పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేసింది. కాగా ఈమె ఇప్పటివరకు కర్నూలు, నంద్యాల జిల్లాల మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జిగా పనిచేశారు. అయితే ఆమెకు నంద్యాల జిల్లాకు బదులుగా కర్నూలుతో పాటు అన్నమయ్య జిల్లాకు నియమించారు.

సంక్షేమ బావుటా

'చేయూత' ఇచ్చారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తరువాత మాలాంటి పేదల జీవితాలు మారాయి. నాకు సంవత్సరానికి రూ.18,750 చొప్పున ఇప్పటికే మూడు సార్లు వైఎస్సార్ చేయూత డబ్బులు వచ్చాయి. వచ్చిన డబ్బులతో మా ఊరిలో నా కుమారుడికి చిన్న జిరాక్స్ బంక్‌ను ఏర్పాటు చేయించాను. ఇప్పుడు మా కుటుంబం ఇబ్బందుల లేకుండా జీవనం సాగిస్తోంది. పేదల కోసం పథకాలను తీసుకవచ్చిన సీఎంకు రుణపడి ఉంటాం.

– దీవెనమ్మ, ఇనగండ్ల గ్రామం, సి.బెళగల్ మండలం

ఇంటి వద్దకే పింఛన్



మేం వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం చేస్తున్నాం. కొద్ది రోజులుగా డయాలసిస్ వ్యాధితో నేను బాధపడుతున్నాను. కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ కింద అక్టోబర్ నెలలో చికిత్స చేయించుకొని ఇంటికి వచ్చాను. నవంబర్ నెలలో మా గ్రామ సచివాలయం ఉద్యోగి, వలంటీర్ ఇంటికి వచ్చి నీకు డయాలసిస్ కింద ప్రభుత్వం రూ.10వేలు పింఛన్ మంజూరు చేసిందని చెప్పి డబ్బు అందించారు. డయాలసిస్ వ్యాధి గ్రస్తులకు ఎవరి ప్రమేయం అవసరం లేకుండా ఆస్పత్రిలో ఎంట్రీ చేసిన ఆధారంగా ప్రభుత్వమే పింఛన్ మంజూరు చేస్తుందని వారు చెప్పారు. గతంలో దరఖాస్తు చేసుకున్నా పింఛన్ వచ్చేది కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాకు మంజూరు చేసిన పింఛన్ సొమ్ము చికిత్స, మందులకు ఎంతో ఉపయోగపడుతోంది.

– గొల్ల నాగేష్, ఎర్రబాదు గ్రామం, గోనెగండ్ల మండలం

క్లుప్తంగా

దుప్పి మాంసం స్వాధీనం



నిందితుడి అరెస్ట్ చూపుతున్న అటవీ అధికారులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని నాగలూటి చెంచుగూడెంకు చెందిన గుల్ల బంటి ఈదన్న అనే వ్యక్తి నుంచి దుప్పి మాంసాన్ని అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నాగలూటి రేంజర్ దొరస్వామి తెలిపిన వివరాల మేరకు.. అటవీ అధికారుల సమాచారం మేరకు మంగళవారం నాగలూటి రేంజ్‌లోని లింగమయ్య కుంట ప్రాంతంలో అటవీ సిబ్బంది తనిఖీ చేపట్టడగా గుళ్ల బంటి ఈదన్న అనే వ్యక్తి 35 కేజీల దుప్పి మాంసం, దుప్పి తల, చర్మంతో పట్టుబడ్డాడు. మరో నిందితుడు గుళ్ల బంగి గురవయ్య తప్పించుకుని పరారయ్యాడు. పట్టుబడిన నిందితుడు బంటి ఈదన్నను కోర్టులో హాజరు పరుచగా జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. లింగమయ్య కుంట వద్ద ఉచ్చులు వేయడం ద్వారా నిందితులు దుప్పిని వధించి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. దాడుల్లో డీఆర్‌వో రత్నప్రభావతి, ఎఫ్‌బీవోలు ముర్తుజావలి, ఎస్ రజాక్ పాల్గొన్నారు.

రూ.2.90 లక్షలు అపరాధ రుసుం వసూలు

కర్నూలు (న్యూటౌన్): అక్రమంగా గ్రావెల్, గ్రానైట్ తరలించి పట్టుబడిన వాహన యజమానుల నుంచి అపరాధ రుసుంగా రూ.2.90 లక్షలు వసూలు చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సి. బెళగల్ మండలం బ్రాహ్మణదొడ్డిలోని సర్వే నంబర్ 550/డీ1లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు చేసిన సలీం నుంచి రూ.1 లక్ష అపరాధ రుసుం విధించి వసూలు చేశామన్నారు. అలాగే ప్రకాశం జిల్లా నుంచి తాడిపత్రికి అక్రమంగా గ్రావెల్ రవాణా చేస్తూ పట్టుబడిన కుమార్ నుంచి రూ.1.55 లక్షలు, తడకనపల్లె నుంచి గ్రావెల్ అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన టిప్పర్ యజమాని చాంద్ బాషా నుంచి రూ.35 వేలు జరిమానా వసూలు చేసినట్లు వెల్లడించారు.

గుర్తు తెలియని వృద్ధురాలి ఆత్మహత్య



వృద్ధురాలి మృతదేహం

బనగానపల్లె రూరల్: నందవరం - బనగానపల్లె గ్రామాల మధ్య ఉన్న రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. నంద్యాల రైల్వే ఎస్ఐ ఎస్ అబ్దుల్ జలీల్ తెలిపిన వివరాల మేరకు.. సుమారు 60–65 ఏళ్ల వయస్సు ఉన్న వృద్ధురాలు సోమవారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. ఉదయం స్థానికులు సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలికు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించపోవడంతో శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలు వివరాలు తెలిసిన వారు నంద్యాల రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

➤ దుస్తులు ఇస్త్రీ చేస్తున్న ఈమె పేరు సంజమ్మ. సొంతూరు డోన్ దగ్గర చింతలపేట అయితే 30 ఏళ్ల క్రితం బతుకుదెరువుకు కర్నూలు చేరుకుని రజక వృత్తిపైనే జీవిస్తున్నారు. తొలుత ఇస్త్రీ పెట్టె, బొగ్గులు, డ్రమ్ములు కొనుక్కునేందుకు చాలా ఇబ్బంది పడేవాళ్లు. ప్రస్తుతం సీఎం జగన్ కుల వృత్తిపై ఆధారపడిన వారికి ఏడాదికి రూ.10 వేలు ఉచితంగా అందిస్తుండటంతో ఈమెకు నాలుగు సార్లు రూ.10 వేల ప్రకారం రూ.40 వేలు వచ్చాయి. ఈ డబ్బులతో రెండు ఇస్త్రీ పెట్టెలు రెండు డ్రమ్ములు, ఇతరత్రా ముడి సరుకులు తెచ్చుకొని సాఫీగా కులవృత్తిని సాగిస్తున్నట్లు సంజమ్మ పేర్కొన్నారు.



➤ సెలూన్ నిర్వహిస్తున్న ఈ వ్యక్తి పేరు వి. సాయి కుమార్. నగరంలోని అబ్బాస్‌నగర్‌లో దుకాణం. జగనన్న చేదోడు పథకం ప్రారంభమైనప్పటి నుంచి నాలుగు విడతలుగా ఏడాదికి రూ.10 వేల ప్రకారం రూ.40 వేలు ఆయన బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. ఈ నగదుతో ఆయన సెలూన్‌కు అవసరమైన చైర్స్, ఇతరత్రా అవసరమైన వస్తువులు కొనుగోలు చేశారు. ముఖ్యమంత్రి జగన్ అందిస్తున్న ఆర్థిక సహకారం ద్వారా షాపును మరింత అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం ఏర్పడిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



చేతి వృత్తులకు 'చేదోడు'!

- నిరంతరాయంగా నాలుగు విడతలుగా ఆర్థిక సహాయం
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.101.48 కోట్లు జమ
- కరోనా కష్టకాలంలో కూడా అందిన సాయం
- చిరు సాయంతో వేలాది కుటుంబాలకు స్వాంతన
- ఆనందం వ్యక్తం చేస్తున్న రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'జగనన్న చేదోడు' తో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వేలాది కుటుంబాలు తమ జీవనోపాధిని మెరుగుపరుచుకుంటున్నాయి. వైఎస్‌ఆర్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చేతి వృత్తులతో జీవనం గడుపుతున్న టైలర్లు, నాయీ బ్రాహ్మణులు, రజకులకు ఏడాదికి రూ.10 వేల ప్రకారం ఐదేళ్ల వరకు ఆర్థిక సహకారం అందిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగానే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేదోడు పథకాన్ని ప్రవేశపెట్టి పక్కాగా అమలు చేస్తున్నారు. 2020 జూన్ 10వ తేదీన పథకాన్ని ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు ఎలాంటి ఆటంకం లేకుండా ఈ పథకం కింద నాలుగేళ్లుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ అవుతూనే ఉంది. దీంతో ఆయా చేతి వృత్తులపై ఆధారపడిన కుటుంబాలకు 'జగనన్న చేదోడు' ఒక వరంగా ఆదుకుంటోంది. చూడ్డానికి చిన్న మొత్తమే అయినా ... కుల వృత్తులపై ఆధారపడి జీవించే వారికి ఇది పెద్ద సాయమే. వృత్తులను అభివృద్ధి చేసుకునేందుకు, అవసరమైన ముడి సరుకును తెచ్చుకునేందుకు ప్రభుత్వ సాయం ఎంతో ఉపయోగపడుతుంది.

నాలుగు విడతలుగా విడుదలైన నిధుల వివరాలు ...

కేటగిరీ	లబ్ధిదారుల సంఖ్య	జమ అయిన మొత్తం (రూ.కోట్లలో)
కర్నూలు జిల్లా ...		
టైలర్లు	25,957	రూ.25.957
రజకులు	13,979	రూ.13.979
నాయీ బ్రాహ్మణులు	9,878	రూ.9.878
మొత్తం:	49,814	రూ.49.814
నంద్యాల జిల్లా ...		
టైలర్లు	15,008	రూ.15.008
రజకులు	24,999	రూ.24.999
నాయి బ్రాహ్మణులు	11,661	రూ.11.661
మొత్తం:	51,668	రూ.51.668

కరోనా కష్టకాలంలో కూడా ...
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన సమయంలో ... రెండేళ్ల కరోనాతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కర్ఫ్యూ, లాక్‌డౌన్‌తో జనజీవనం స్తంభించిపోయింది. అలాంటి సయమంలో కూడా ప్రభుత్వం పథకం అమలులో ఎలాంటి వెనకడుగు వేయలేదు. చేతి వృత్తులు చేసుకునే వారికి ఎలాంటి ఇబ్బంది కలగరాదనే దృఢ సంకల్పంతో పథకంలో భాగంగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదును జమ చేసింది.

అభివృద్ధి దిశగా చేతి వృత్తులు ...
రాష్ట్ర ప్రభుత్వం రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు ఏడాదికి రూ.10 వేల ప్రకారం అందిస్తున్న ఆర్థిక సహాయంతో వారు చేతి వృత్తులను అభివృద్ధి చేసుకుంటున్నారు. రజకులు వారి కుల వృత్తికి అవసరమైన డ్రమ్ములు, ఇస్త్రీ పెట్టెలు, బొగ్గులు తదితర సామగ్రికి ఈ నగదును ఉపయోగించుకుంటున్నారు. టైలర్లు, నాయీ బ్రాహ్మణులు వారికి అవసరమైన మెటీరియల్‌ను కొనుగోలు చేసి షాపులను అభివృద్ధి పరచుకుంటున్నారు.

చేదోడు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



జగనన్న చేదోడు పథకాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని తమ వృత్తులను మెరుగుపరచుకోవాలి. ఈ పథకం కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాలుగు విడతల్లో 1,01,482 మంది లబ్ధిదారులకు రూ.101,48,20,000 జమ చేయడం జరిగింది. ప్రభుత్వం అందిస్తున్న రూ.10 వేలతో ఆదాయ వనరులను పెంచుకోవాలి. ఈ మొత్తం పెట్టుబడి అవసరాలు తీర్చేందుకు ఉపయోగించుకోవాలనే ప్రభుత్వం ఆశయాన్ని నెరవేర్చాలి.

– పి. వెంకటలక్షుమ్మ, ఈడీ, బీసీ కార్పొరేషన్

నాయీ బ్రాహ్మణులకు ప్రభుత్వం అండ



కుల వృత్తిపై ఆధారపడి జీవనం చేస్తున్న నాయీ బ్రాహ్మణులకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో అండగా నిలుస్తోంది. జగనన్న చేదోడు పథకం ద్వారా అందిస్తున్న రూ.10 వేలతో సేవింగ్ సెలూన్‌కు అవసరమైన ఫేషియల్స్ కాస్మోటిక్స్ తదితర మెటీరియల్‌ను కొనుగోలు చేసుకుంటున్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా మాకు ఆర్థికంగా ఆదుకోవాలని ఆలోచించ లేదు. చేదోడు పథకం వల్ల మా నాయీ బ్రాహ్మణులకు ఎంతో మేలు చేకూరుతోంది.

– స్వామి చంద్రుడు, నగర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కన్వీనర్

పేద రజకులకు ఎంతో ఉపయోగం



జగనన్న చేదోడు పథకంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న ఏడాదికి రూ.10 వేలు పేద రజకులకు ఎంతో ఉపయోగపడుతోంది. ఇళ్ల వద్ద, వేర్వేరు ప్రాంతాల్లో చిన్న చిన్న బంకులు పెట్టుకొని కుల వృత్తి చేసుకుంటున్న రజకులు అనేక మంది ఈ పథకం ద్వారా అందిన నగదుతో కొత్త ఇస్త్రీ పెట్టె, బొగ్గులు, డ్రమ్ములు కొనుగోలు చేసుకున్నారు. గతంలో మాదిరిగా అప్పులు చేసే తిప్పలు తప్పింది. రజకులను ఆదుకుంటున్న జగనన్నకు రుణ పడి ఉంటాం.

– బావనపల్లె భారతి, రజక వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు

కత్తితో బెదిరించి దోపిడీ

మహానంది: నంద్యాల - మహానంది రహదారిలో గుర్తు తెలియని దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన జరగగా ఆలస్యంగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు విజయవాడ నుంచి ఇద్దరు మహిళలు మహానందిలోని బంధువులు ఇంట్లో జరిగే శుభకార్యానికి వచ్చేందుకు నంద్యాల రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆటోలో బయలుదేరగా సుగాలిమెట్ట సమీపంలో ఆటో మరమ్మతులకు గురికావడంతో డ్రైవర్ పుల్లయ్య గమనించి నిలిపాడు. అదే సమయంలో ఇద్దరు గుర్తు తెలియని ఆటోడ్రైవర్ తలపై కర్రతో కొట్టడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. ఆటోలో ఉన్న ఓ మహిళను కత్తితో బెదిరించి సమీపంలోని పొలాల్లోకి తీసుకెళ్లారు. ఆమె వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లు, కమ్మలు, వెండి పట్టీలు, సుమారు రూ. పదివేలు నగదు తీసుకున్నారు. స్పృహ వచ్చిన డ్రైవర్ వెంటనే అక్కడి నుంచి తేరుకుని తమ్మడపల్లె వరకు పరిగెత్తుకుంటూ వచ్చి అక్కడ ఉన్న స్థానికులకు విషయం తెలుపగా అందరూ కలిసి ఘటనా స్థలానికి వెళ్లారు. అప్పటికే గుర్తించిన దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో బాధితులు నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.



పొలాల్లో రైతు నేస్తాల సందడి

గడివేముల: పంట పొలాల్లో రైతు నేస్తాలు సందడి చేస్తున్నాయి. రైతులు రబీ సీజన్‌కు పొలాలను దున్ని సాగుకు సిద్ధం చేసుకుంటున్న సమయంలో తెల్లటి కొంగలు గుంపులు గుంపులుగా చేరి ఆహారం కోసం అన్వేసిస్తున్నాయి. పొలంలోని పురుగులను తినేస్తూ వాటి ఆకలిని తీర్చుకుంటూ రైతులకు నేస్తాలుగా మారాయి. ఈ దృశ్యం మంగళవారం గడివేముల మండలంలోని పెసరవాయి గ్రామంలో కనిపించింది.

శివ కేశవులకు అభిషేకాలు ప్రీతికరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జ్వాలాపురం శ్రీకాంత్

కర్నూలు(అర్బన్): కార్తీక మాసంలో శివ కేశవులకు అభిషేకాలు ప్రీతికరమని రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు సందేల్ చంద్రశేఖర్ అధ్యక్షతన స్థానిక దేవీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం రాత్రి కార్తీక మాస సమారాధన సత్సంగ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జ్వాలాపురం శ్రీకాంత్ మాట్లాడుతూ అర్చకుల సమస్యలతో పాటు కర్నూలు బ్రాహ్మణ భవన నిర్మాణం తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు వెళ్ళాల మధుసూధనశర్మ, హైదరాబాద్ బ్రాహ్మణ సంక్షేమ వేదిక నాయకులు బాలా శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో బ్రాహ్మణుల్లో స్నేహభావం, ఐక్యత బలపడుతుందన్నారు. ఉపాధ్యక్షులు సందేల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి ఆధ్వర్యంలో కర్నూలులో నారాయణ అన్న ప్రసాద వితరణ పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు. బ్రాహ్మణ కుటుంబంలో ఎవరైనా మరణిస్తే వారి దహన సంస్కారాల రోజు 50 భోజనాలను ఉచితంగా ఏర్పాటు చేయడం ఈ పథకం ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్యాంసుందర్‌రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగులవరం రాజశేఖర్, చల్లా నాగరాజశర్మ, కోశాధికారి ఆకెళ్ల రాధాక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తజన సందడి

ఓర్వకల్లు: మండలంలోని కొమ్మచెరువు ఆంజనేయస్వామి, బొడ్డువానిపల్లె వీరాంజనేయస్వామి, కాల్వ కోనేటి ఆంజనేయస్వామి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక మాసం తర్వాత వచ్చిన తొలి అమావాస్య కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆంజనేయుడిని దర్శించుకుని సింధూర అలంకరణ, ఆకు పూజలు, అన్నప్రసాద వితరణ చేశారు.

కాల్వలో లక్ష దీపోత్సవం

కార్తీక మాసం ముగింపు సందర్భంగా కాల్వ గ్రామం వద్ద వెలసిన కోనేటి ఆంజనేయస్వామి ఆలయం వద్ద లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. 100 జంటలు పాల్గొని దీపాలు వెలిగించారు. జ్వాలాతోరణం, సింధూర పూజ అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. లక్ష దీపోత్సవం కార్యక్రమంలో కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ విజయమనోహరి, డ్వామా అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ మాధవీలత, ఎంపీడీఓ శివనాగప్రసాద్ దంపతులు పాల్గొని స్వాముల వారికి ప్రత్యేక పూజలు చేశారు.

వైఎస్సార్‌సీపీ యువజన విభాగంలో జిల్లాకు చోటు



మధుసూదన్‌రెడ్డి బీఏకే పర్వేజ్ షేక్ రియాజ్

కర్నూలు (రాజ్‌విహార్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర కమిటీలో కర్నూలు జిల్లాకు చెందిన నాయకులకు చోటు దక్కింది. ఎం.మధుసూదన్‌రెడ్డిని జోనల్ ఇన్‌చార్జ్ (జోన్–7), బి.అబ్దుల్లా ఖాన్ పర్వేజ్ (బీఏకే పర్వేజ్) కార్యదర్శిగా, షేక్ రియాజ్ (రియాజ్ బాబా) సంయుక్త కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు యువజన విభాగం కమిటీలో చోటు కల్పించామని అందులో తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ అమరనాథ్‌రెడ్డి

ఓర్వకల్లు: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకం కింద జగనన్న కాలనీల్లో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం హుసేనాపురం గ్రామంలోని జగనన్న కాలనీని ఆయన పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీశారు. త్వరగా ఇళ్లను నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఏవైనా ఇబ్బందులుంటే తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి జగనన్న కాలనీలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఆయన వెంట ఈసీ మధు వెంకట కృష్ణ, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ .. ఒకరు మృతి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కర్నూల్ రోడ్డు హోటల్ గ్రాండ్ మా సమీపంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం స్కూటర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. వివరాలు.. ఎమ్మిగనూరు మండలం మాసుమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన వడ్డె రామాంజీ.. నందవరం మండలం గంగవరం చెందిన బంధువు వడ్డె రంగస్వామి(38) ఇద్దరు కలసి బైక్‌పై మదర్‌థెరిస్సా బీఈడీ కాలేజీ దగ్గర నుంచి ఎమ్మిగనూరు వైపు వస్తున్నారు. కర్నూల్ వైపు వెళ్తున్న గుర్తుతెలియన వాహనం బైక్‌ను ఢీ కొట్టడంతో వడ్డె రంగస్వామి తలపగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. వడ్డె రామాంజీకి గాయాలయ్యాయి. ప్రమాద విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ సి.శరత్‌కుమార్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. గాయపడ్డ వ్యక్తిని చికిత్స కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు. మృతుడు రంగస్వామికి 8 నెలల క్రితమే వివాహమైనట్లు బంధువులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ విలేకరులకు తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

నందవరం: మండల పరిధిలోని ముగతి గ్రామ పరిధిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ మహేష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు..ఎమ్మిగనూరు టౌన్ సమీపంలో కోసిగి రోడ్డులో సోమవారం రాత్రి గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మహిళ మృతదేహంగా గుర్తించారు. మృతురాలి కుడి చేతికి అమ్మ, హైమావతి, ఏసయ్య అనే తెలుగు అక్షరాలతో పచ్చబొట్లు ఉన్నాయి. ముగతి వీఆర్వో చంద్రశేఖర్ గౌడ్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలి సమాచారం తెలిసిన వారు సెల్: 91211 01150 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ముమ్మరంగా వరి కోతలు

గడివేముల: మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. పెసరవాయి, కరిమద్దెల, చిందుకూరు, బూజునూరు, మంచాలకట్ట, దుర్వేశి, గడిగరేవుల గ్రామాలలో అధికంగా వరి సాగు చేశారు. విత్తు వేసినప్పటి నుంచి రైతన్నలు చీడపీడలు, తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాలకు ఎదురొడ్డి పైరును కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. బోర్లలో, కేసీ కెనాల్, తెలుగుగంగకు నీరు ఉండటంతో వారి కష్టానికి ఫలితంగా వరి కాపు బాగా కాసింది. పంట పక్వానికి రావడంతో మండలంలోని రైతులు కోతల్లో బిజీగా ఉన్నారు. ఎకరాకు దాదాపు 30 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వస్తోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



శివరాత్రి, ఉగాది ఉత్సవాలకు రూ. 10.53 కోట్లు



ధర్మకర్తల మండలి సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్, ఈఓ

- రూ.52 కోట్లతో భక్తుల సౌకర్యార్థం 200 గదుల వసతి నిర్మాణం
- ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు ఫ్లైవర్ బ్రిడ్జి ఏర్పాటుకు ప్రతిపాదన
- శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి

శ్రీశైలంటెంపుల్: వచ్చే ఏడాది శ్రీశైల క్షేత్రంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు, ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని రూ.10.53 కోట్ల అంచనా వ్యయంతో 82 సివిల్, ఎలక్ట్రికల్, జనరల్ పనులు చేయుటకు ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపినట్లు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి తెలిపారు. మంగళవారం దేవస్థాన పరిపాలన భవనంలో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ అధ్యక్షతన ధర్మకర్తల మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం 30 అంశాలు అజెండాగా చర్చించగా 28 అంశాలకు ట్రస్ట్‌బోర్డు ఆమోదించింది. ఒక అంశం వాయిదా వేయగా, మరో అంశాన్ని తిరస్కరించారు. ఈ సమావేశంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు మఠం విరూపాక్షయ్యస్వామి, జి.నరసింహారెడ్డి, ఎం.విజయలక్ష్మి, బి.రామేశ్వరి, అంబాల లక్ష్మీసావిత్రమ్మ, ఎ.మురళి, మేరాజోత్ హనుమంత్‌నాయక్, ఓ.మధుసూదన్‌రెడ్డి, డా.సి.కనకదుర్గ, ప్రత్యేక ఆహ్వానితులు తన్నీరు ధర్మరాజు, దేవస్థానం అన్ని యూనిట్ విభాగాల అధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఆమోదించిన అంశాలు

➤ భక్తుల వసతి సౌకర్యార్థం గణేశ సదనం సమీపంలో తలపెట్టిన 200 గదుల వసతి సముదాయ నిర్మాణానికి రూ.52 కోట్లు కేటాయింపు.
➤ రూ.39 లక్షల అంచనా వ్యయంతో శిఖరేశ్వరస్వామి ఆలయ ప్రహరీ ఎత్తు పెంచి బండపరుపు, ఇతర అభివృద్ధి పనులు.
➤ రూ.10 లక్షలతో శిఖరేశ్వరం ఆలయం వద్ద ఆర్చ్ గేట్ నిర్మించి కాంక్రీట్ రోడ్డు.
➤ రూ.38.50 లక్షల వ్యయంతో క్షేత్రపరిధిలో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలను అధిగమించేందుకు టోల్‌గేట్, నందిసర్కిల్ వద్ద ఫీకాస్ట్ సెంటర్ డివైడర్లు ఏర్పాటు.
➤ రూ.15.50 లక్షలతో సిద్ధిరామప్ప మూల జంక్షన్ వద్ద రహదారిని విస్తరణ.
➤ రూ.13 లక్షలతో కల్యాణ కట్టలో పలు మరమ్మతులు, అభివృద్ధి పనులు.
➤ క్షేత్ర ప్రచారంలో భాగంగా స్థలపురాణం, చరిత్ర, క్షేత్ర ప్రత్యేకతలు మొదలైన అంశాలు పొందుపరుస్తూ ఆయా చిత్రాలతో కాఫీటేబుల్ పుస్తకం ప్రచురణ.
➤ ఉత్సవాల సమయంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రాజుల సత్రం నుంచి సిద్ధరామప్ప కొలను వరకు బ్రిడ్జి నిర్మించాలన్న ప్రతిపాదనకు ట్రస్ట్‌బోర్డు ఆమోదం.
➤ మల్లికార్జున సదన్ నుంచి టోల్‌గేట్ వరకు, టోల్‌గేట్ నుంచి రామయ్య టర్నింగ్ వరకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుకు ప్రతిపాదనలు.

క్లుప్తంగా

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



ధనలక్ష్మి బ్యాంకు బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(సెంట్రల్): బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ సూచించారు. మంగళవారం విద్యా నగర్‌లో ఏర్పాటు చేసిన ధనలక్ష్మి బ్యాంకును ఆయన ప్రారంభించారు. ధనలక్ష్మి బ్యాంకు మొదటి బ్రాంచ్ కర్నూలులో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి బ్యాంకుల ద్వారా పది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తుండడంతో తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ విజయకుమార్‌రెడి, జనరల్ మేనేజర్ చంద్రన్, బ్రాంచ్ మేనేజర్ ఎండీ అబ్దుల్ అక్రం, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ కిరణ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి



రిలే దీక్షలకు హాజరైన అంగన్‌వాడీలు

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని గ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల, ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలంటూ ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు తెలంగాణలో కంటే ఏపీలో రూ.వెయ్యి ఎక్కువగా ఇస్తామన్న సీఎం తన హామీ నిలబెట్టుకోవాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్లను వర్తింపజేయాలని కోరారు. విద్యార్హతను బట్టి ఉపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్ పీఎస్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

17న సాహిత్యోపన్యాసం

కర్నూలు కల్చరల్: సాహితీ సదస్సు ఆధ్వర్యంలో ఈనెల 17న పండుగ సుబ్బారెడ్డి స్మారకోపన్యాసం ఏర్పాటు చేసినట్లు సదస్సు అధ్యక్షులు చంద్రశేఖర కల్కూర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ఉదయం 10 గంటలకు 'విశ్వనాథ సత్యనారాయణ వేయిపడగలు – సనాతన ధర్మం' అంశంపై సాహిత్యో పన్యాసం ఉంటుందన్నారు. కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయం అతిథి ఆచార్యులు సాహిత్య రత్న డాక్టర్ గండ్ర లక్ష్మణ రావు ముఖ్య వక్తగా హాజరై ప్రసంగిస్తారన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

కర్నూలు(టౌన్): ఈనెల 9న నంద్యాలలో నిర్వహించిన అండర్ -14 క్రికెట్ ఎంపిక పోటీల్లో తమ కళాశాల విద్యార్థి గౌతమ్ ప్రతిభ కనబరిచాడని శ్రీచైతన్య కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. విద్యార్థిని మంగళవారం డీన్ హరితో కలిసి అభినందించారు. విద్యార్థి గౌతమ్ ప్రతిభ చాటి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 13 నుంచి నంద్యాలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో గౌతమ్ పాల్గొంటాడని తెలిపారు.

రెండో రోజు సాగిన న్యాయవాదుల దీక్షలు

కర్నూలు (లీగల్): ఏపీ భూ హక్కుల చట్టం 2022 జీవో 512ను ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో స్థానిక శ్రీకృష్ణదేవరాయ విగ్రహం వద్ద చేపట్టిన న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. దీక్ష శిబిరంలో న్యాయవాదులు వి.రవికుమార్, ఓంకార్, మురళీమోహన్, డి.వెంకటస్వామి, సీఐటీయూ జిల్లా నాయకులు పి.నిర్మల, రాధాకృష్ణ, ప్రజాపరిరక్షణ సమితి నాయకులు డేవిడ్, బలరాం, రాయలసీమ ఉద్యమ నాయకులు నాయుడు, ఎంఆర్ కృష్ణ, పాపన్న, మనోహర్ రాజు, సురేష్ కుమార్, ధనారెడ్డి, బి.శ్రీనివాసులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది చంద్రుడు, కార్యదర్శి చక్రపాణి,, ఆంజనేయులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : ఎనిమల్, హాయ్ నాన్న, ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : ఎనిమల్, హాయ్ నాన్న, ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : ఎనిమల్, హాయ్ నాన్న, ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్
ఐనాక్స్ : వోంక, హాయ్ నాన్న,శ్యామ్ బహదూర్
శ్రీరామ : మా ఊరి పొలిమేర2
రాజ్ : ఎనిమల్
విజయ : ఎనిమల్

జనవరి 15న గృహప్రవేశాలు జరిగేలా చూడాలి

● హౌసింగ్ అధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన





మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన   హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): వచ్చేనెల 15న గృహప్రవేశాలు జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్‌డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెగా కంప్లిషన్ డ్రైవ్‌లో జిల్లాలో 15 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. రోజువారి లక్ష్యాల సాధనలో భాగంగా ఎమ్మిగనూరు, ఆస్పరి, కోడుమూరు, కల్లూరు, కృష్ణగిరి, మంత్రాలయం, గోనెగండ్ల, కోసిగి, ఆలూరు ఆదోని, తుగ్గలి, పెద్దకడబూరు, చిప్పగిరి, గూడూరు మండలాల్లో పురోగతి లేదన్నారు. ఆప్షన్-3 కింద నిర్మాణంలో ఉన్న ఇళ్ల పనుల్లో పురోగతి లేకపోతే సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పనులు జరుగుతున్న సమయంలో ఎవరికీ చెప్పకుండా మధ్యలో నిలిపి వేసి వెళ్లిపోతే వారి నుంచి చేసిన ఖర్చును రికవరీ చేస్తామన్నారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైతే బ్యాంకులు రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ సిద్ధలింగమూర్తి, ఎల్‌డీఎం రామచంద్రరావు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకారంలో పంచముఖ ఆంజనేయస్వామి



హోమంలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీ లలితా పీఠంలో మంగళవారం అమావాస్యను పురస్కరించుకుని పంచముఖ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, పల్లకీసేవ, శ్రీ వెంకట అన్నమచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 27 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం, మహా అన్నప్రసాదం వితరణ కార్యక్రమాలు జరిగాయి. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం సందేశమిచ్చారు.

● స్థానిక సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో లోక కల్యాణార్థం అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవగ్రహ లక్ష్మీ గణపతి, మూల మంత్ర సహిత చండీహోమం తదితర విశేష పూజలు నిర్వహించారు. ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి

● ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షుడు, సీపీఎం నేత ఎంఏ గఫూర్



మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

కర్నూలు(సెంట్రల్): ఈ నెల 15, 16, 17 తేదీలలో కర్నూలులో జరిగే ఆల్ ఇండియా కిసాన్ సంఘ్(ఏఐకేఎస్) జాతీయ కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని కౌన్సిల్ సమావేశాల ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ కోరారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమావేశాల చీఫ్‌ప్యాట్రన్ అర్జా రామకృష్ణతో కలిసి గఫూర్ మాట్లాడుతూ సంక్షోభంలో ఉన్న వ్యవసాయాన్ని ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేట్లకు కోట్లాది రూపాయల సబ్సిడీలు ఇచ్చే ప్రభుత్వాలు అన్నదాతలకు ఎందుకు రుణాలు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్‌తో పాటు మందులు, ఎరువులు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు నుంచి రైతులను ఆదుకోవడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి మాట్లాడతూ సోమవారం నుంచి సాంస్కృతిక, పౌరాణికం, సామాజిక, నృత్య కళారూపాల ప్రదర్శనను కర్నూలులోని పాతబస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట ప్రతిరోజూ 5 గంటలకు చేపడుతున్నట్లు చెప్పారు. 15న ఏడు వేల మందితో ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందన్నారు. సమావేశాలకు 8 సార్లు ఎంపీగా గెలుపొందిన రైతు ఉద్యమ నాయకుడు హనన్‌మొల్లా, ఏఐకేఎస్ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు అశోక్ ధావలే, విజుకృష్ణన్ హాజరు కానున్నట్లు చెప్పారు. సమావేశంలో ఆహ్వాన సంఘం సహాయ కార్యదర్శి ఏ.రాజశేఖర్, ట్రెజరర్ రామకృష్ణ పాల్గొన్నారు.

● ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో రైతన్నకు కార్మిక వర్గం అండగా నిలవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్ కోరారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో కర్నూలు మార్కెట్ యార్డుకోత అంగడి గుమస్తాల యూనియన్, ఎస్టేట్ హమాలీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు సీహెచ్‌సాయిబాబా, టి.రాముడు పాల్గొన్నారు.

● ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల నిర్వహణ ఖర్చుల కోసం మహిళా సంఘం రూ.లక్ష విరాళం ప్రకటించింది. మంగళవారం సుందరయ్యభవన్‌లో అందుకు సంబంధించిన చెక్కును ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డికి మహిళా సంఘం నాయకులు ధనలక్ష్మి, పద్మ, కిరణ్మాయి అందజేశారు.

మేఘన హత్యపై విచారణ చేయించాలి

కర్నూలు(సెంట్రల్): స్థానిక వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన వివాహిత మేఘన హత్యపై పూర్తి స్థాయి విచారణకు ఫోర్‌మెన్ కమిటీని నియమించాలని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పీటీ సాయిప్రదీప్, మాజీ సభ్యుడు సత్తి రాజశేఖర్ మంగళవారం కలెక్టర్ డాక్టర్ జి.సృజనను కలిసి వినతిపత్రం ఇచ్చారు.

గ్రామీణ్ డాక్ సేవకులను రెగ్యులర్ చేయాలి

కర్నూలు (న్యూటౌన్): గ్రామీణ్ డాక్ సేవకులను రెగ్యులర్ చేయాలని ఆలిండియా గ్రామీణ్ డాక్ సేవక్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు లక్ష్మీకాంతరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పాతబస్టాండులోని హెడ్‌పోస్టాఫీసు ఆవరణలో ఏఐజీడీఎస్‌యూ పిలుపు మేరకు దేశవ్యాప్త నిరవధిక సమ్మె చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంతో ఆర్భాటంగా పార్లమెంట్‌లో బ్రిటీష్ కాలం నాటి చట్టాలు దేశాభివృద్ధికి నిరోధకాలని, వాటిని తొలగిస్తున్నారని అన్నారు. కానీ తపాలాశాఖకు జీవమైన జీడీఎస్ వ్యవస్థను దౌర్భాగ్యస్థితిలో ఉన్నా మోదీ కళ్లకు కనబడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీడీఎస్ ఉద్యోగులు ప్రవీణ్ కుమార్, కృష్ణ, షాషావలి, జగన్, శ్రీనివాసులు,రత్నమయ్య, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒత్తిడి అధిగమించాలంటే యోగా చేయాలి

కర్నూలు(టౌన్): ఒత్తిడిని అధిగమించాలంటే ప్రతి ఒక్కరు యోగా చేయాలని రాజ్య సభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ సూచించారు. ఈనెల 16, 17 తేదీల్లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్‌లో నిర్వహించనున్న రెండవ ప్రపంచ యోగ పోటీల్లో కర్నూలు క్రీడాకారులు పాల్గొనడం శుభపరిణామం అన్నారు. మంగళవారం టీజీ నివాసంలో అంతర్జాతీయ యోగ పోటీలకు ఎంపికైన యోగా క్రీడాకారులను ఆయన అభినందించారు. క్రీడాకారులకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటున్న యోగా క్రీడాకారుల్లో ఎస్.ప్రసన్న, కె.మునిస్వామి, ఎం.మనీషా, గురుప్రీతి, మనుశ్రీ, పలనాటి మనస్వినీలు ఉన్నారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు అవినాష్ శెట్టి పాల్గొన్నారు.

పేదలకు మంచి చేసిన నాయకుడు సీఎం జగన్



సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్):పేదలకు అన్ని విధాలా మంచి చేసేందుకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర క్లస్టర్-2 అధ్యక్షుడు కేదార్‌నాథ్ అన్నారు. మంగళవారం బుధవారపేట 44వ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన ప్రతిహామీని అమలు చేసిన జగనన్నను మరోసారి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మైనారిటీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఆసీఫ్, సేవా దల్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, నాయకులు షౌకత్ అలీ, అక్బర్ అలీ, అనిల్, చందు, గరీబా పాల్గొన్నారు.

మిషన్ ఇంద్రధనస్సును సద్వినియోగం చేసుకోండి



చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ఏదైనా కారణం చేత గతంలో టీకాలు వేయించని చిన్నారులకు మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో తప్పకుండా వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ సూచించారు. జొహరాపురం యూపీహెచ్‌సీ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ సచివాలయంలో జరుగుతున్న మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకాలు ఇప్పించడం ద్వారా 12 రకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. 16వ తేదీ వరకు కార్యక్రమం ఉంటుందని ఐదేళ్లలోపు పిల్లలకు, గర్భిణులకు టీకాలు వేయించి వివరాలను అప్‌లోడ్ చేయాలని ఆరోగ్య కార్యకర్తలను ఆదేశించారు. మాతాశిశు సంరక్షణ కార్డులో టీకాల వివరాలను నమోదు చేయాలన్నారు. అనంతరం నవజాత శిశు గృహ సందర్శన చేసి శిశువుల ఆరోగ్యపరిస్థితిని పరిశీలించి సూచనలిచ్చారు.

స్టెమి ప్రోగ్రామ్‌పై వైద్యులకు వర్క్‌షాప్



మాట్లాడుతున్న డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): స్టెమి/ఎమర్జెన్సీ కార్డియాక్ కేర్ వర్క్‌షాప్‌పై వైద్యులకు మంగళవారంస్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రిలోని 50 మంది వైద్యులకు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఎమర్జెన్సీ కార్డియాక్ కేర్‌పై వివరించామన్నారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా రిఫ్రెషింగ్ కోర్సు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో డీసీహెచ్ కింద పనిచేసే జనరల్ మెడిసిన్ వైద్యులు, జీజీహెచ్‌లోని మెడికల్ విభాగం వైద్యులు పాల్గొన్నట్లు చెప్పారు. గుండెపోటు వచ్చే కారణాలు, ఈసీజీలో వచ్చే మార్పులు, అత్యవసర ట్రీట్‌మెంట్ ఇవ్వడం, థ్రాంబోలైసిస్ చేయడం, రోగులను 108 అంబులెన్స్ ద్వారా ఎలా ఆసుపత్రికి తీసుకురావాలి, ఆసుపత్రికి వచ్చిన తర్వాత రోగికి స్టెంట్ ఎలా వేస్తారు, బైపాస్ సర్జరీ ఎలా చేస్తారనే విషయాలపై కార్డియాలజీ వైద్యులు శిక్షణ ఇచ్చారన్నారు. ఈ తరహా కోర్సులు ఇప్పటి వరకు గుంటూరు, వైజాగ్‌లో మాత్రమే జరిగాయన్నారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ లక్ష్మీబాయి, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ మహేశ్వరరెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ లలిత, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.


ఆధునిక వైద్యసదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలి



నూతన సంవత్సర ప్యాకేజీని ఆవిష్కరిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సదుపాయాలు ఎక్కడ ఉన్నా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ సూచించారు. మంగళవారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో నూతన సంవత్సర ప్యాకేజీని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అత్యాధునిక సదుపాయాలు, పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్యులు కలిగి అన్ని రకాల వైద్యసేవలు అందిస్తున్న ఇలాంటి ఆసుపత్రులు ప్యాకేజీల ద్వారా సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ హెడ్ మహేశ్వర రెడ్డి, సెంటర్ హెడ్ నీలారెడ్డి, మార్కెటింగ్ హెడ్ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో ఇద్దరికి పదోన్నతులు



సుబ్బన్నకు పదోన్నతుల ప్రతిని అందజేస్తున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులకు పదోన్నతులు లభించాయి. నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం సీనియర్ అసిస్టెంట్ సుబ్బన్న, రెవెన్యూ విభాగం సీనియర్ అసిస్టెంట్ రాజేశ్వరరావులకు సూపరింటెండెంట్లుగా పదోన్నతి లభించింది. మంగళవారం సాయంత్రం నగర మేయర్ బీవై రామయ్య తన క్యాంపు కార్యాలయంలో పదోన్నతుల ప్రతులు అందజేశారు.

బారికేడ్ల వితరణ



పోలీసులకు బారికేడ్లను అందజేస్తున్న సంస్థ చైర్‌పర్సన్ రామ్‌నిరంజన్ అగర్వాల్

కర్నూలు: నగరంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఎంఎస్ స్టీల్ పైప్స్ మహాలక్ష్మి ప్రొఫైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హైదరాబాదు) చైర్‌పర్సన్ రామ్‌నిరంజన్ అగర్వాల్ రూ.6 లక్షలు విలువ చేసే బారికేడ్లను పోలీసు అధికారులకు అందజేశారు. మంగళవారం డీఎస్పీ విజయశేఖర్‌ను కలిసి ఆయన కార్యాలయం వద్ద 50 బారికేడ్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ వినోద్ అగర్వాల్, బ్రాంచ్ మేనేజర్ కార్తీక్, ఏరియా సేల్స్ ఆఫీసర్ మహబూబ్‌బాషాతో పాటు సీఐలు శంకరయ్య, పవన్‌కుమార్, ఇంతియాజ్‌బాషా, శ్రీరాం, కిరణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలు తెలియజేయండి

● నగరపాలక కమిషనర్ భార్గవతేజ



మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ భార్గవతేజ

కర్నూలు (టౌన్): నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని నగరపాలక కమిషనర్ భార్గవతేజ చెప్పారు. మంగళవారం సాయంత్రం స్థానిక నగరపాలకలోని తన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ముసాయిదా జాబితాలో వచ్చిన అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఓటర్ల జాబితాలోని మరణాలు, వలసలు, పునరావృతమైన ఓట్లు, కావాల్సిన మార్పులు, కొత్త ఓటర్ల నమోదు వంటి పలు అంశాలు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. సచివాలయాల పరిధిలో బూత్ లెవల్ ఆఫీసర్ల పరిధిలో ఓటర్ల సర్వే చేస్తున్నామని చెప్పారు. కర్నూలు నగర పరిధిలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే నగరంలోని వివిధ పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేక నమోదు కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓటరు ప్రక్రియలో ఏవైనా ఇబ్బందులు, ఫిర్యాదులు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కమిషనర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. అంతకుముందు ఫారం-6, 7, 8 ద్వారా నమోదైన దరఖాస్తుల పురోగతిని కమిషనర్ సమీక్షించారు. సమావేశంలో కర్నూలు అర్బన్ తహశీల్దార్ విజయశ్రీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐఎస్ఏ ఉమ్మడి మహాసభలు



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కర్నూలు సిటీ: ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్(ఏఐఎస్ఏ) ఉమ్మడి కర్నూలు జిల్లా మహాసభలు మంగళవారం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. అంతకుముందు నగరంలో సంఘం నాయకులు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభల్లో కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి భాగ్యమ్మ, ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు పాల్గొని ప్రసంగించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్, జిల్లా కార్యదర్శి నాగార్జున, జిల్లా నాయకులు రాజు పెద్దయ్య, సాయి పవన్, ఏలియా, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

16న జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

కర్నూలు సిటీ: ఈనెల 16న నగరంలోని టౌన్ మోడల్ హైస్కూల్‌లో జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ఉంటుందని డీఈఓ డా.వి రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో నేడు, రేపు జరగనున్న మండల స్థాయి విజేతలు పాల్గొంటారని, జిల్లా స్థాయిలో గెలిస్తే రాష్ట్ర స్థాయి పోటీలకు వెళతారన్నారు. ఎగ్జిబిషన్‌కు హాజరయ్యేవారు ఉదయం 8 గంటలకే చేరుకోవాలన్నారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తజనం



పూజలందుకుంటున్న ఈరన్న స్వామి మూలవిరాట్

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న (నరసింహ) స్వామి దేవాలయం వేలాది మంది భక్తులతో సందడి నెలకొంది. మంగళవారం అమావాస్య ఉండడంతో భక్తులు తమ ఇలవేల్పును దర్శించుకోవడానికి వేలాదిగా తరలివచ్చారు. కార్తీక మాసం చివరిరోజు కావడంతో తరలివచ్చిన భక్తజనంతో ఆలయ పరిసర ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి. స్వామివారి దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారుజామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. భక్తులకు విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనం, శ్రీఘ్ర దర్శనం, ఉచిత, వీఐపీ దర్శనాల ద్వారా దర్శనానికి పంపారు. ప్రత్యేక దర్శనం క్యూలైన్‌లో కూడా భక్తులు గంటకుపైగా నిలబడి స్వామివారి దర్శనం చేసుకున్నారు.కొందరు భక్తులు పిండివంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తుల సౌకార్యర్థం ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటకలోని రాయచూరు, శిరుగుప్ప డిపోలవారు ప్రత్యేక బస్సులను నడిపారు. కౌతాళం పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉద్యాన పంటల సాగు పెంచేందుకు చర్యలు తీసుకోవాలి

● పార్లమెంట్‌లో ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్

కర్నూలు(రాజ్‌విహార్): ఉద్యాన పంటల సాగును పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ కోరారు. మంగళవారం ఆయన పార్లమెంట్‌లో ప్రశ్నోత్తరాల సమయంలో గ్లోబల్ ట్రేడ్‌లో హార్టికల్చర్ షేర్స్ అంశాన్ని లేవనెత్తారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్య ప్రపంచంలో దేశం చాలా తక్కువగా కేవలం 1 శాతం మాత్రమే ఉందని, కూరగాయలు, పండ్ల తోటలు పెంచాల్సిన అవసరం ఉందని సభ దృష్టికి తెచ్చారు. రైతుల మేలు కోసం రవాణా, మౌలిక సదుపాయాలు, అస్థిరమైన సరఫరా, పంట నిల్వ కోసం గోదాముల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ మండా సమాధానం ఇస్తూ.. ఉద్యాన పంటల సాగును పెంచేందుకు చర్యలు చేపట్టామన్నారు.

గుంత పూడ్చండి సారూ!



రెండు నెలల క్రితం పైప్‌లైన్ కోసం తవ్వి అలాగే వదిలేసిన గుంత

కర్నూలు(న్యూటౌన్): ఓల్డ్‌సిటీలోని 3వ వార్డు అలీషేర్‌బాగ్‌లో రెండు నెలల క్రితం తాగునీటి పైప్ లైన్ కోసం గుంత తవ్వారు. అనంతరం గుంతను పూడ్చకుండా అలాగే వదిలేయడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. అటువైపు కాలినడక వెళ్లాలంటే వృద్ధులు, పిల్లలు జారి గుంతలో పడతామేమోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగర పాలక సంస్థ అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

మెడికల్ స్టోర్‌లో చోరీ

కర్నూలు: వెంకటరమణ కాలనీలోని ప్రసన్న మెడికల్ స్టోర్‌లో చోరీ జరిగింది. నిర్వాహకుడు లోకేష్ సోమవారం రాత్రి వ్యాపారం ముగించుకుని షటర్ వేసి ఇంటికెళ్లాడు. మంగళవారం ఉదయం దుకాణానికి వచ్చి చూసేసరికి షటర్ కొంత భాగం తెరిచి ఉంది. లోపలికి వెళ్లి చూడగా టేబుల్ డ్రాయర్‌లో ఉన్న డబ్బు కనిపించలేదు. దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకుని రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాదాపు రూ.40 వేలకు పైగా చోరీ జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

నేడు ఎస్ఆర్ నియామకాలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

కర్నూలు (హాస్పిటల్): స్థానిక మెడికల్ కళాశాలలో సీనియర్ రెసిడెంట్లుగా పనిచేసేందుకు బుధవారం వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 82 మంది సీనియర్ రెసిడెంట్లను వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయనున్నామన్నారు. కళాశాలలోని ఆడిటోరియంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

పీటీడీ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(రాజ్‌విహార్): జిల్లా ప్రజా రవాణా శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎంయూ రాష్ట్ర కార్యదర్శి ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక కొత్త బస్టాండ్‌లోని కర్నూలు-1డిపో గ్యారేజీ ముందు నల్ల బ్యాడ్జీలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వలి, రంగన్న, నాయుడు తదితరులు పాల్గొన్నారు.